# డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

సూర్యాపేట అర్బన్, అక్టోబర్ 15 : డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం రాత్రి ఉన్నతాధికారులు నియామక పత్రాలను అందించారు. వారు నేటి నుంచి 15 రోజులలోపు ఎప్పుడైనా విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 325 మంది ఉపాధ్యాయులకు రాత్రి 10 గంటల వరకు నియామక పత్రాలు అందించారు. ఉద్యోగ పత్రాలు అందుకొని అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు.



నియామక పత్రాలను తీసుకునేందుకు వచ్చిన అభ్యర్థులు

## మధుసూదనాచారికి మాజీ ఎంపీ బడుగుల శుభాకాంక్షలు



శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఎన్నికైన సిరికొండ మధుసూదనాచారిని శాసనమండలిలోని తన చాంబర్‌లో మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నవీన్

నేరేడుచర్ల, అక్టోబర్ 15 : వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వైకుంఠాపురం రెవెన్యూ పరిధిలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన అంకిరెడ్డి పున్నమ్మ పొలాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, రామస్వామి, రైతులు నూకల సత్యనారాయణ రెడ్డి, అంకిరెడ్డి సోమయ్య, సైదులు, పున్నమ్మ పాల్గొన్నారు.



పంట నష్టపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# మా ఊరుకు రోడ్డు వేయండి

● ప్రభుత్వానికి లేఖ రాసిన చిట్టిప్రోలు గూడెం గ్రామస్తులు

నేరేడుచర్ల, అక్టోబర్ 15 : ప్రభుత్వాలు మారిన తమ గ్రామ రోడ్డు పరిస్థితి మారడం లేదని మండలంలోని దిర్శించర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చిట్టిప్రోలు గూడెం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు ప్రభుత్వానికి లేఖ రాశారు. దిర్శించర్ల గ్రామం నుంచి ముత్యాలమ్మ కుంటకు సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మార్గమధ్యలోనే చిట్టిపోలు గూడెం గ్రామం ఉంటుంది. అటు మిర్యాలగూడకు ఇటు నేరేడుచర్లకు రావాలంటే ఈ దారే దిక్కు. కానీ ఈ రోడ్డు చిన్నపాటి వర్షానికే మొత్తం బురదమయంగా మారి వాహనదారులు, పాదచారులు నడువలేని పరిస్థితి నెలకొంది. కనీసం పొలం పనులకు వెళ్లలేకుండా ఉంటుంది. రోడ్డు గురించి ఏ నాయకుడు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా రోడ్డు వేయాలని కోరుతూ ఒక పేపర్‌పై గ్రామస్తులు అంతా సంతకాలు చేసి అధికారులకు పంపారు.



చిత్తడిగా మారిన నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల – ముత్యాలమ్మ కుంట రోడ్డు

# పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం

గరిడేపల్లి, అక్టోబర్ 15 : మండలంలోని కల్మల్‌చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–2000 సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను, పాఠశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రావిరాల అంజయ్య, రంగారెడ్డి, వాచ్‌మన్ నర్సోజి, పూర్వ విద్యార్థులు దుర్గ, కల్పన,రాంబాబు, చంద్రయ్య, సంజీవ్, నాగశేఖర్, రవి, రాముడు, సైదులు, శ్రీను, నరేశ్, శ్యాసుందర్, నాగాచారి, శ్రీను పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

# కారు ఢీకొని బాలుడు మృతి

గరిడేపల్లి, అక్టోబర్ 15 : కారు ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రాయినిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ – కోదాడ ప్రధాన రహదారిపై ఉదయం సమయంలో బెక్కం శ్రీరాం (11)ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు తన అమ్మమ్మ వెంకటలక్ష్మితో కలిసి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న స్విఫ్ట్ కారు ఢీకొట్టింది. డ్రైవర్ తన కారును అజాగ్రత్తగా నడిపి శ్రీరామ్‌ను ఢీకొట్టడంతో బాలుడి తల, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని హుజూర్‌నగర్‌లోని హాస్పిటల్‌కు, అక్కడి నుంచి కోదాడ హాస్పిటల్‌కు తరలించినా పరిస్థితి విషమించడంతో చనిపోయాడు. మృతి చెందిన బాలుడు మాజీ ఎంపీటీసీ బెక్కం అంజయ్య మనవడు. బాలుడి తండ్రి బెక్కం అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చలికంటి నరేశ్ తెలిపారు.



బెక్కం శ్రీరాం (ఫైల్)

## డయేరియా నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

చింతలపాలెం, అక్టోబర్ 15 : డయేరియా నివారణకు చర్యలు చేపట్టాలని తాసీల్దార్ సురేందర్‌రెడ్డికి మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు మహబూబ్ అలీ వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 6304222202.
NT-338782

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |


# సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయాలి

● కలెక్టర్ నారాయణరెడ్డి

తిప్పర్తి, అక్టోబర్15 : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి ఒకటో తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు ఇదివరకే ప్రకటించిందని, అందుకే సన్న వడ్లను ప్రత్యేకంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి రైతులకు లాభం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇస్తున్నదన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర అందిస్తున్నదని తెలిపారు. సన్నధాన్యంలో ఉన్న రకాలను సైతం వేర్వేరుగా మిల్లులకు పంపించాలని ఆదేశించారు. రైతులు ప్రైవేటు వ్యక్తులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. వర్షానికి ధాన్యం తడువకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



తిప్పర్తి :ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

### కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

నల్లగొండ రూరల్ : రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం నల్లగొండ మండలం మర్రిగూడ బైపాస్ రోడ్డు వద్ద హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మట్లాడారు. కార్యక్రమంలో డీఏస్ఓ వెంకటేశ్వర్లు, డీసీఓ పట్యానాయక్, హాకా డీఎం కోటయ్య, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, దీపక్, సుమానంద్, కేంద్రం ఇన్‌చార్జి నూల కోటేశ్ పాల్గొన్నారు.

### కనగల్ మండలంలో..

నల్లగొండ సిటీ : కనగల్ మండలంలోని పర్వతగిరి, కనగల్, బుడమర్లపల్లి, కురంపల్లి, శాబ్దుల్లాపురం, జీ ఎడవల్లి, పగిడిమర్రి, దోరేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ, ఎంపీఓ సుమలత, ఏపీఎం సంకుహరి, ఎంపీఓ సుధాకర్, సీసీఎస్‌లు వసంత, విజయ, ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ వెంకటేశం నాయకులు పాల్గొన్నారు.

### మాడ్గులపల్లిలో

మాడ్గులపల్లి : మండలంలోని చెరుపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు అర్రూరి నరేశ్, ఎరుకల వెంకన్న, హరికృష్ణ, నాగరాజు, వెంకట్‌రెడ్డి, సైదులు, రైతులు పాల్గొన్నారు.

## అదనపు పీపీగా వెంకటరమణారావు



రామగిరి, అక్టోబర్ 15: జిల్లా కోర్టులో మొదటి అదనపు డిస్ట్రిక్ట్ సెషన్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నల్లగొండకు చెందిన సీనియర్ న్యాయవాది కొలనుపాక వెంకటరమణరావును నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. దాంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కోర్టు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిశారు.

## చిట్యాల జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎంగా మాధవి

చిట్యాల, అక్టోబర్ 15 : చిట్యాల జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా గోగికార మాధవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న కర్ణాకర్‌రెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో తనను ఇన్‌చార్జిగా విద్యాశాఖ అధికారులు నియమించినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## మాల మహానాడు చిట్యాల మండలాధ్యక్షుడిగా భాస్కర్

చిట్యాల, అక్టోబర్ 15 : మాలమహానాడు మండలాధ్యక్షుడిగా చిట్యాలకు చెందిన గోలి భాస్కర్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భాస్కర్ ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో అధ్యాపకుల కోసం దరఖాస్తులు

శాలిగౌరారం, అక్టోబర్ 15 : మండలంలోని వల్లాల గ్రామంలోని మోడల్ స్కూల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకుల పోస్టులకు గంటల ప్రాతిపదికన బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

హాలియా, అక్టోబర్15 : మండలంలోని పుల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మనాది చిన పురుశోత్తం గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 13న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి చిన పురుశోత్తం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు చెన్ను సుందర్‌రెడ్డి, కేవీ రామారావు, నడ్డి లింగయ్య, తుడుం ముత్తయ్య, వడ్డె సతీశ్‌రెడ్డి, మనాది పురుషోత్తం, మనాది శేఖర్, సైదులు, రమేశ్ నాయక్, బీమానాయక్ ఉన్నారు.



చిన పురుశోత్తం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

## ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి :పీఆర్‌టీయూ

మిర్యాలగూడ రూరల్/చిట్యాల, అక్టోబర్ 15: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటే వేసేందుకు ఉపాధ్యాయులందరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యడవెల్లి దామోదర్‌రెడ్డి, కందాల చంద్రారెడ్డి కోరారు. మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం, చిట్యాల మండలం ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాకులకు ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. నవంబర్ 2018 నుంచి 30 అక్టోబర్ 2024 మధ్య కాలంలో ఉన్నత విద్యా సంస్థల్లో మూడు సంవత్సరాలు పనిచేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ సర్వీస్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఓటరు గుర్తింపు కార్డు, చిరునామాతో పీఆర్‌టీయూ బాధ్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జడల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ వహీద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైసర్ సబిహా, పి.శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దరఖాస్తు ఫారాలు అందిస్తున్న నాయకులు

## ట్రాన్స్‌కో డీఈగా సుధీర్‌కుమార్

మిర్యాలగూడటౌన్, అక్టోబర్15: విద్యుత్‌శాఖ మిర్యాలగూడ డివిజినల్ అధికారిగా టి.శ్రీనివాస సుధీర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నల్లగొండ కన్‌స్ట్రక్షన్ డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు డీఈని శాలువాతో సత్కరించారు.



సుధీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, అక్టోబర్ 15 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని కొర్లపహాడ్, కొత్తపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారులు కేంద్రాలను తనిఖీ చేస్తూ ధాన్యం కొనుగోళ్ల వేగవంతం అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి హరీశ్, జిల్లా అసిస్టెంట్ రిజిస్టార్ నాగేశ్వర్‌రావు, డీసీఓ పత్యానాయక్, తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ బి.పురుశోత్తం, మాజీ ఎంపీపీ గుత్తా మంజులామాధవరెడ్డి, కొత్తపేట సింగిల్‌విండో డైరెక్టర్ పి.సుధాకర్‌రెడ్డి, నాయకులు కె.శ్రీనివాస్‌యాదవ్, కోట మల్లికార్జునరావు, బొజ్జ సుందర్, జె.వెంకటనర్సయ్యయాదవ్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## నేడు హాలియా మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

హాలియా, అక్టోబర్ 15 : హాలియా వ్యవసాయమార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కాల్సాని చంద్రశేఖర్‌తో పాటు 12 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఈ నెల 3న రాష్ట్ర మార్కెటింగ్ కార్యదర్శి రఘునందర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. హాలియాలో జరిగే పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

### అనుముల నాయకులకు మొండిచెయ్యి

హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అనుములతో పాటు పెద్దవూర, తిరుమలగిరి సాగర్ మండలాలు ఉన్నాయి. అయితే మార్కెట్ కమిటీ పాలకవర్గంలో అనుముల మండల నాయకులకు మొండి చెయ్యి చూపారని మండల కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. చైర్మన్‌గా పెద్దవూర మండలం, వైస్ చైర్మన్‌గా తిరుమలగిరి సాగర్ మండల వాసులకు అవకాశం కల్పించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు తాము ఎంతో కష్టపడి పని చేశామని, అయినా నామినేటెడ్ పోస్టుల భర్తీలో తమను గుర్తించకపోవడం బాధాకరమని అనుముల మండల కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు.

## ఉద్యమకారులకు సీఎం రేవంత్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జానకిరెడ్డి

నందికొండ, అక్టోబర్ 15 : ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ కారులకు సీఎం రేవంత్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె. జానకిరెడ్డి డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టి ఇస్తామని సీఎం మాట ఇచ్చారన్నారు. ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి వెంకన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జానకిరెడ్డి

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పూర్తి

చండూరు,అక్టోబర్ 15: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులను గుర్తించేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా, ఇద్దరు స్వయం సహాయక సభ్యులు, ముగ్గురు స్థానికులతో కమిటీలను వేసినట్లు పేర్కొన్నారు.

### మిర్యాలగూడ మున్సిపాలిటీలో ..

మిర్యాలగూడ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ వార్డు కమిటీల ఏర్పాటుకు సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో పాటు కమిషనర్ ఎండీ. యూసుఫ్, కౌన్సిలర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు. ప్రతి కమిటీలో వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా, వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా, ఇద్దరు సమభావన సంఘం సభ్యులు, ముగ్గురు సభ్యులు ఇతరులను నియమించనున్నట్లు వారు తెలిపారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డుల్లో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు విషయమై సమావేశంలో చర్చించి పూర్తి చేశారు.

## పవువులకు టీకాలు వేయించాలి : ఏడీ శంకర్‌రావు

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్15 : ప్రతి దూడకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యశాఖ ఏడీ శంకర్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని తడకమళ్ల, తుంగపహాడ్ గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. రెండు గ్రామాల్లో 450 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు నాయిని దుర్గారమాదేవి, జ్ఞానేశ్వర ప్రసాద్, వీఎల్ఓ నజీర్, కృష్ణ, సుభాని, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### హెచ్ఐవీపై అవగాహన

నకిరేకల్, అక్టోబర్ 15 : నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో మంగళవారం నకిరేకల్ పట్టణంలో అభినవ్ ఆర్ట్స్ అకాడమీ కళాబృందం ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారి నరసింహస్వామి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో ఆయా సంస్థల అధికారులు భిక్షమయ్య, చెట్టుపల్లి వెంకన్న, కళాబృందం సభ్యులు పరమేశ్, నాగరాజు, లింగస్వామి, నరసింహ, ప్రవీణ్, శైలజ పాల్గొన్నారు.

### గొంతునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

కొండమల్లేపల్లి, అక్టోబర్ 15 : గొంతునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్‌రోడ్డుకు చెందిన కేతావత్ నర్సింహ కుమారుడు కేతావత్ సుధాకర్(17) పట్టణంలో ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతడు నాలుగేండ్లుగా గొంతునొప్పితో బాధపడుతున్నాడు. పలుమార్లు వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. దాంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన సుధాకర్ సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జగన్ తెలిపారు.

### నేడు,రేపు జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు : డీఈఓ

రామగిరి, అక్టోబర్ 15: జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈ నెల 16, 17న నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, సినికళలు, చిత్రలేఖనం, సాంప్రదాయ కథలు అంశాల్లో పోటీలుంటాయని తెలిపారు. 9 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

### వాల్మీకి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి, అక్టోబర్15 : నల్లగొండలోని వాల్మీకి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్టుగూడ, బస్టాండ్, క్లాక్‌టవర్, అంబేద్కర్‌సర్కిల్ మీదుగా వాల్మీకి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిధర్మసమాజ్, ఆదాస్ భారత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల హక్కు మాదే : దర్గా ముతవల్లీలు

రామగిరి, అక్టోబర్ 15: నల్లగొండ పట్టణంలోని లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాలను జరిపే హక్కు తమకే ఉందని దర్గా ముతవల్లీలు సల్మాన్ ఖాద్రి, సమీవుల్లా ఖాద్రి తెలిపారు. మంగళవారం దర్గా ప్రాంతంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరం ఉర్సు ఉత్సవాలను వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు కొందరు సోషల్ మీడియాలో వార్తలు పెడుతున్నారని, కానీ బోర్డు ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. 400 సంవత్సరాల నుంచి తమ పూర్వీకులు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ సంవత్సరం ఉర్సు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో దర్గా ముతవల్లీలు రషీద్‌సాబ్, ఒబేదుల్లా ఖాద్రి పాల్గొన్నారు.

### గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి : ఎంపీడీఓ

కొండమల్లేపల్లి, అక్టోబర్ 15 : గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ బాలరాజరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీ, మరమ్మతులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటర్ల రిపేర్, చేతి పంపుల రిపేర్, నీటి నాణ్యత పరీక్షలు వంటి వాటిపై నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సీవీ నర్సింహారావు, డీఈ కేతావత్ నగేష్, మాల్యాద్రి, బి. శేఖర్, లింగం, జె. శ్రీలేఖ, వెంకటేశ్ పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

మునుగోడు, అక్టోబర్15 : మండల కేంద్రానికి చెందిన యాసరాణి శివ(24) మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి సోదరుడు సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా తలుపు మూసి ఉండడం, ఇంట్లోంచి పురుగుల మందు వాసన వస్తుండడంతో తలుపులు పగులగొట్టి లోనివెళ్లాడు. అప్పటికే శివ మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. అతడి మృతికి కారణాలు తెలియరాలేదని, శివ తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### హరితహారం మొక్కలను సంరక్షించాలి : డీఎల్పీఓ

నల్లగొండ రూరల్, అక్టోబర్ 15: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని డీఎల్పీఓ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్ద సూరారం గ్రామాన్ని సందర్శించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు గ్రామంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా, పచ్చగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ముసుకు నవీన్ ఉన్నారు.

### నిజామాబాద్ సభను విజయవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్

నల్లగొండ, అక్టోబర్ 15: ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటానికి ఈ నెల 16న నిజామాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. మంద కృష్ణ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతున్న దృష్ట్యా సభకు మాదిగలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థులకు దుస్తుల పంపిణీ

నందికొండ, అక్టోబర్ 15 : నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు కాలనీకి చెందిన మంచికంటి శ్రీనివాస్ కుమారుడు వంశీ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు అందించినటుఌ తెలిపారు. కార్యక్రమంలో రాజబాబు, విమల, లాలు, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

### ఎల్లాపురంలో కొనసాగుతున్న భూముల సర్వే

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 15: రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న భూముల సర్వే మంగళవారం మండలంలోని ఎల్లాపురం గ్రామంలో కొనసాగింది. రెవెన్యూ అధికారులు రైతులకు సంబంధించిన భూములను సర్వే చేశారు. కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న రైతుల భూములను సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు విజయ్, లక్ష్మణ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గిరి, రైతులు పాల్గొన్నారు.

### జేత్యాతండాలో గుప్త నిధుల కలకలం

వీరన్న గుట్టలో పెద్ద ఎత్తున తవ్వకాలు

కొండమల్లేపల్లి, అక్టోబర్ 15 : మండంలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని జేత్యాతండాలో గుప్త నిధుల కోసం భారీగా తవ్వకాలు జరిపిన విషయం మంగళవారం వెలుగుచూసింది. తండా పరిధిలో గల సర్వే నంబర్– 19లో సుమారు 110 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. ఆ స్థలాన్ని కొందరు రియల్టర్లు కొనుగోలు చేశారు. ఆ స్థలంలో గల వీరన్న గుట్టలో బండలపై వెలిసిన వీరన్న, మల్లన్న, అంజనేయుస్వామి విగ్రహాలు ఉన్నాయి. తండావాసులు వీటికి పూజలు చేస్తున్నారు. ఆ భూమిని కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు గుట్ట చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి నాలుగు నెలలుగా జేసీబీల సాయంతో రాత్రి వేళల్లో తవ్వకాలు జరిపారు. అయితే గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపారని తండావాసులు ఆరోపిస్తున్నారు. దసరా పండుగకు కూడా దేవుళ్ల విగ్రహాల వద్దకు వెళ్లకుండా సదరు రియల్ వ్యాపారి అడ్డుకోవడంతో తండా వాసులు గోడదూకి లోనికి వెళ్లి చూడగా విగ్రహాలు పగిలి ఉన్నాయని, గుప్త నిధుల కోసం తవ్విన గుంతలు కనిపించినట్లు వారు తెలిపారు. గుంతలు ఎందుకు తవ్వారని రియల్ వ్యాపారిని నిలదీస్తే పొంతన లేని సమాధానం చెబుతున్నారని తండా వాసులు చెప్పారు. తండావాసుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ అజ్మీరా రమేశ్ తెలిపారు.

### 17న వేణుగోపాల స్వామి కల్యాణం

చిట్యాల, అక్టోబర్ 15 : ఈ నెల 17 మండలంలోని వట్టిమర్తి గ్రామంలో గల వేణుగోపాల స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 17 వరకు స్వామి వారి 17వ వార్షిక బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి భీష్మాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.